క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని నూకల రామచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి.లక్ష్మణ్ నాయక్ ఆదివారం తెలిపారు. 2025 విద్య సంవత్సరంలో తెలుగు-02, ఇంగ్లిష్-02, కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ అప్లికేషన్‌లో-2, డెయిరీ సైన్స్-1, కామర్స్‌లో-1, పొలిటికల్ సైన్స్‌లో-1 ఖాళీలు ఉన్నాయన్నారు. దరఖాస్తుదారుల బీసీ, జనరల్ అభ్యర్థులకు అర్హతలు పీజీలో 55శాతం, ఎస్సీ, ఎస్టీలకు పీజీలో 50శాతం మార్కులు కలిగి ఉండాలని, నెట్, సెట్, పీహెచ్‌డీ కలిగిన అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 23వ తేదీ సాయంత్రం 4:30 గంటల వరకు దరఖాస్తులను మానుకోట జిల్లా కేంద్రంలోని కళాశాలలో అందజేయాలన్నారు. ఈనెల 24న గురువారం ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలన్నారు.

వాలీబాల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక


వెంకట్‌రెడ్డి, అధ్యక్షుడు

తొర్రూరు: వాలీబాల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం పట్టణంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా అప్పిడి వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కొమ్మనబోయిన వెంకన్న, కోశాధికారిగా బాద యాకసాయి, ఉపాధ్యక్షులుగా పేరం ప్రవీణ్, మేరుగు రమేష్, సంయుక్త కార్యదర్శులుగా ఊడుగుల మధుకర్, కారంపూరి సురేష్, సమన్వయకర్తగా గుర్రం వెంకన్న, సలహాదారులుగా కొండం జనార్దన్, వాసిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, జోగు వెంకన్న, ఉపేందర్ రెడ్డి, రాయిపల్లి యాకయ్య, రేవూరి శ్రీధర్, జాఫర్ అలీలను ఎన్నుకున్నారు. అసోసియేషన్ వ్యవస్థాపకులు గొడిశాల నగేష్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక చేపట్టారు.

రూ.లక్ష ఆర్థికసాయం



కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన ఆవుల వెంకన్న అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈమేరకు స్పందించిన ఇనుగుర్తి జెడ్పీ హైస్కూల్‌కి చెందిన 1989-90 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు బాధిత కుటుంబానికి రూ.లక్ష ఆర్థికసాయాన్ని ఆదివారం అందజేశారు.

గోర్ భాషను 8వ షెడ్యూల్‌లో చేర్చాలి



కురవి: గోర్ భాషను (గోర్‌బోలి) రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని గోర్‌సభ జాతీయ అధ్యక్షుడు జైసింగ్ రాథోడ్ అన్నారు. ఆదివారం సీరోలు మండలం కాంపల్లి శివారు బీల్యానాయక్ తండాలో గోర్‌సభ సమావేశం కేలోత్ అర్జున్ చౌహాన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోర్ ఉప జాతులు నివసించే తండాలను రెవెన్యూ పంచాయతీలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం ముఖ్య సలహాదారుడు డాక్టర్ నెహ్రూనాయక్, గోర్‌బోలి లిపి రచయిత సురేందర్ నాయక్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలు తక్షణమే నిర్వహించాలి

మరిపెడ రూరల్: 18నెలలుగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ఊరిస్తూ పొడిగిస్తుందని, ఇప్పటికైన తక్షణమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించి గ్రామ పరిపాలన వ్యవస్థలను మెరుగుపర్చాలని సీపీఎం మండల కార్యదర్శి గుండగాని మధుసూదన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని అబ్బాయిపాలెం గ్రామ కమిటీ సమావేశం శనివారం రాత్రి సీనియర్ నాయకులు ఎర్ర వెంకన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు బాణాల రాజన్న, జిన్నా లచ్చయ్య, కొండ ఉప్పలయ్య, నందిపాటి వెంకన్న పాల్గొన్నారు.

కేసు నమోదు

డోర్నకల్: బాలకార్మికులను పనిలో పెట్టుకున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు డోర్నకల్ ఎస్సై గడ్డం ఉమ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ.. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా ఆదివారం చైల్డ్‌లైన్, లేబర్ అధికారులు వివిధ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. వాటర్ ప్లాంట్‌తోపాటు మెకానిక్ షాపులో ఇద్దరు బాలురు పని చేస్తున్నట్లు గుర్తించి వారిని మహబూబాబాద్ చైల్డ్ హోంకు తరలించి తమకు ఫిర్యాదు చేయగా వాటర్ ప్లాంట్, మెకానిక్ షాప్ యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లపై ధరల భారం

- ప్రభుత్వం ఇచ్చే బిల్లులతో పూర్తికాని నిర్మాణాలు..
- పెరిగిన సిమెంట్, ఐరన్ ధరలు
- సందిగ్ధంలో లబ్ధిదారులు

గూడూరు: తెలంగాణ వచ్చాక రెండు దఫాల బీఆర్‌ఎస్ పాలన అనంతరం జరిగిన ఎన్నికల్లో ఇందిరమ్మ, మాజీ సీఎం వైఎస్సార్ చేసిన పలు అభివృద్ధి పనులను ప్రజలకు గుర్తు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన నిరుపేదలు ఇందిరమ్మ ఇళ్లు కట్టుకునేందుకు నిర్మాణానికి రూ.5లక్షలు ప్రకటించారు. ఈ క్రమంలో మండలంలోని 41జీపీలకు గాను మొదటి విడతలో 800మంది అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ప్రకటించారు. అందులో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఓ పక్క సంతోషంగా ఉన్నా, మరో పక్కన ప్రభుత్వం ఇచ్చే డబ్బులతో ఇల్లు నిర్మాణం పూర్తవుతుందా అన్న సందిగ్ధంలో ఉన్నారు. దీనికి తోడు పథకం ప్రారంభం కావడంతోనే ఇసుక, ఐరన్ ధరలు పెరిగాయి. దీంతో సామాన్యులపై అదనపు భారం పడుతుండడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే డబ్బులతో ఇల్లు నిర్మాణం పూర్తికాదని, నిర్మించుకుందామా.. వద్దా అన్న సందిగ్ధంలో పడ్డారు.


నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

నిర్మించుకుంటే పెరిగిన ధరలను బట్టి ఒక్కొక్క ఇంటిపై రూ.4నుంచి రూ.6లక్షల వరకు అదనపు భారం పడేలా ఉందని లబ్ధిదారులు వాపోతున్నారు.

ప్రభుత్వ నిబంధన ప్రకారం..

ఇందిరమ్మ ఇళ్లు అంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం 400నుంచి 600చదరపు అడుగుల మేరకు నిర్మించుకునే అవకాశం ఉంది. ఐతే ప్రస్తుతం గ్రామాల్లో అధికారుల సూచన మేరకు 580 అడుగుల విస్తీర్ణంలో ముగ్గులు పోస్తున్నారు. ఆ ఇంటి నిర్మాణానికి ఉపయోగపడే వస్తువులు ఇప్పుడున్న ధరల ప్రకారం.. కట్రౌతు కోసం 3ట్రాక్టర్ల సిమెంట్ ఇటుకులకు రూ. 30వేలు, 6ట్రాక్టర్ల 20ఎంఎం కంకర రూ. 27వేలు, ట్రాక్టర్ 40ఎంఎం కంకర రూ.5వేలు, ఐరన్ 25క్వింటాలకు గాను రూ.1.50వేలు, ఇసుక 15ట్రాక్టర్లకు రూ.1.20వేలు, మొరం 30ట్రాక్టర్లకు రూ.12వేలు, ఇటుక 5 ట్రాక్టర్లకు గాను రూ.90వేలు, సిమెంట్ 250 బస్తాలకు రూ.87,500లు కాగా, ఇల్లు నిర్మించే మేస్త్రీ, లేబర్ చార్జీలకు గాను రూ. 2.80లక్షలు తీసుకుంటుండగా, ఇక్కడి వరకు మొత్తం ఖర్చు రూ.8.15లక్షలు అవుతుంది. అదనంగా ఫ్లోరింగ్, ప్లంబింగ్, డోర్లు, కిటికీలు, ఎలక్ట్రిక్ పనులు, రంగులు కలిపితే మొత్తం మరో రూ. 3లక్షలు కావచ్చునని మేస్త్రీలు చెప్పే అంచనా. అంటే ప్రతీ లబ్ధిదారుడికి ఇంటిపై సగటున పడుతున్న భారం ప్రస్తుత ధరల ప్రకారం రూ. 6లక్షల పైచిలుకే.

పెరిగిన ధరలతో ఇల్లు కట్టలేం..



ఇందిరమ్మ ఇళ్లకు అవసరమయ్యే ఇసుక, సిమెంట్, ఐరన్ తక్కువ ధరకు ఇప్పిస్తామని ప్రభుత్వం చెప్పింది. కానీ ఇంత వరకు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. సొంతంగా డబ్బులు వెచ్చించి పిల్లర్ల దాక ఇంటి నిర్మాణం చేశాను. సిమెంట్, ఐరన్ ధరలు చాలా పెరిగాయి. ప్రభుత్వం వీటిని తక్కువ ధరకు ఇప్పించకపోతే రూ. 5లక్షల్లో ఇల్లు కట్టలేం.

– సనప సంధ్య, లబ్ధిదారు, మచ్చర్ల, కొమురంభీంనగర్

సంక్షేమ పథకాలే కాంగ్రెస్‌ను గెలిపిస్తాయి

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి

తొర్రూరు రూరల్: సంక్షేమ పథకాలే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తాయని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహకాల్లో భాగంగా ఆదివారం మండలంలోని సోమారం గ్రామంలో కాంగ్రెస్ ఎంపీటీసీ క్లస్టర్ సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు చింతకుంట్ల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ.. ఏడాదిన్నర కాలంలో ప్రజాప్రభుత్వం ఎంతో చేసిందన్నారు. అభివృద్ధి చేసేవారికి సహకరిస్తే రాబోయే రోజుల్లో మరింత చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఇందిరా క్రాంతి పథకం కింద సోమారంలోని ఎస్సీలకు నాటి వైఎస్సార్ ప్రభుత్వం భూములు ఇచ్చిందని, ఆ సాగు భూముల్లో రూ.10లక్షలతో దారి ఏర్పాటు చేస్తానని, సీసీ రోడ్లు, పాఠశాలకు ప్రహరీ సదుపాయాలు కల్పిస్తామన్నారు. సోమారం గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి పరుస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యానాయక్, మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, మండల ఇన్‌చార్జ్‌లు ఎర్రబెల్లి రాఘవరావు, చాపల బాపురెడ్డి, నాయకులు విద్యాకర్‌రెడ్డి, సహదేవ్, గిరిధర్, సోమేశ్వర్‌రావు, నెహ్రూ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

బహిర్గతమైన కాంగ్రెస్ వర్గ పోరు

మండలంలోని సోమారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీలో వర్గ పోరు బహిర్గతమైంది. ఆదివారం గ్రామంలో పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి వేర్వేరుగా కాంగ్రెస్ ఎంపీటీసీ క్లస్టర్ సమావేశాలు నిర్వహించారు. కాకిరాల ప్రత్యేక సమావేశం విషయం తెలుసుకున్న ఝాన్సీరెడ్డి ఆయనను సమావేశానికి పిలిచేందుకు ఇంటికి పార్టీ ప్రతినిధులను పంపించగా హరిప్రసాద్ అనుచరులు వారిని వెనక్కి పంపించారు. దీంతో ఒకింత ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. గో బ్యాక్ ఝాన్సీరెడ్డి అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. కాంగ్రెస్‌లో అసాధారణ పరిస్థితులకు ఝాన్సీరెడ్డినే కారణమని, సమన్వయం చేయకుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో సొంతంగా అభ్యర్థులను నిలుపుతానని హరిప్రసాద్ స్పష్టం చేశారు.

సాగునీరు అందించడంలో ఎమ్మెల్యే విఫలం

తొర్రూరు: మండల రైతులకు సాగు నీరు అందించడంలో స్థానిక ఎమ్మెల్యే విఫలమయ్యారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, మాజీ జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్ అన్నారు. డివిజన్ కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సారెస్పీ కాలువల్లోకి నీరు విడుదల చేయించడంలో ఎమ్మెల్యే తాత్సారం చేస్తున్నారని, వారికి రైతాంగం, వ్యవసాయం అంటే విముఖత ఉందన్నారు. నాట్లు వేసుకున్న రైతులు నీటి కోసం ఎదురు చూస్తున్నారని, పంటలు ఎండే పరిస్థితి దాపురించిందని తెలిపారు. దయాకర్‌రావు మంత్రిగా ఉన్న సమయంలో కాలువల్లో నీరు సకాలంలో వచ్చేవన్నారు. నీరు విడుదల చేయకపోతే తీవ్రస్థాయిలో ఆందోళలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షులు రామిని శ్రీనివాస్, నాయకులు కుర్ర శ్రీనివాస్, నలమాస ప్రమోద్, మాలోతు కాలునాయక్, శామకూరి ఐలయ్య, జనార్దన్‌రాజు, రాయిశెట్టి వెంకన్న, లేగల వెంకట్‌రెడ్డి, యర్రంరాజు, జాటోతు స్వామి పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు

బీమా సౌకర్యం కల్పిస్తాం..

కురవి: జర్నలిస్టులతోనే సమాజం బాగుపడుతుందని, అందుకు జర్నలిస్టులు ఆరోగ్యంగా ఉండాలని, జర్నలిస్టుల కోసం రూ.10లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తామని కిసాన్ పరివార్ సంస్థ అధినేత నునావత్ భూపాల్‌నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని కందికొండ గ్రామంలో సంస్థ ఫాంహౌస్‌లో జర్నలిస్టుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. వార్తా సేకరణలో ప్రమాదాలు జరిగితే కుటుంబాలను ఆదుకోవడం కోసం బీమా సౌకర్యం ఉపయోగపడుతుందన్నారు. సంపదను సృష్టించడం కోసం పరిశ్రమలను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని, ప్రభుత్వాలపై ఆధారపడి ఉండకుండా మనమే సంపదను సృష్టించుకోవాలని సూచించారు. జర్నలిస్టులకు ఏ సమస్య వచ్చినా ఆదుకునేందుకు సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు. జర్నలిస్టులందరికీ హెల్మెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో గాడిపల్లి మధు, లెనిన్, యాదగిరి, సుధాకర్, శ్రీనివాస్, శ్రీహరి, గుట్టయ్య, శేఖర్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

31న కలెక్టరేట్ ఎదుట ధర్నా

నెహ్రూసెంటర్: పని గంటల పెంపును నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుట ధర్నా కార్యక్రమాలు నిర్వహించాలని టీయూసీఐ మహబూబాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొత్తపల్లి రవి, బిల్లకంటి సూర్యం పిలుపునిచ్చారు. కలెక్టరేట్ ఎదుట ధర్నాను విజయవంతం చేయాలని జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికుల శ్రమ దోపిడీకే పని గంటల పెంపును కార్పొరేట్, పెట్టుబడివర్గాల కోసమే ప్రభుత్వాలు తీసుకువస్తున్నాయని ఆరోపించారు. ప్రజాపరిపాలన అంటూ సీఎం రేవంత్‌రెడ్డి కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుట జరిగే ధర్నాలకు కార్మికులు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కమ్మగాని సంపత్, బీకు, అర్వపల్లి వెంకన్న, శ్రీరాం పుల్లయ్య, రాములాల్, పూణెం రవికుమార్, యాకయ్య, చింత నవీన్ పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

రాజకీయ రిజర్వేషన్లు ప్రకటించాలి


మాట్లాడుతున్న మహేష్

నెహ్రూసెంటర్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్ ప్రకటిస్తూ ఆర్డినెన్స్ జారీ చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో దివ్యాంగులకు, ఆసరా పింఛన్లపై ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ బుక్కపురం మహేష్‌మాదిగ, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎండి.పాషా డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో వీహెచ్‌పీఎస్, ఎంఆర్‌పీఎస్ అనుబంధ సంఘాల సమావేశం ఆదివారం నిర్వహించారు. జిల్లా కేంద్రంలో ఈనెల 23వ తేదీన చేయూత పింఛన్‌దారుల ఆవేదన జిల్లాస్థాయి సదస్సు నిర్వహిస్తున్నామని వికలాంగులు, ఆసరా పింఛన్‌దారులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సదస్సుకు పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణమాదిగ హాజరవుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు శాగంటి రమేష్, బేతోల్ కిరణ్, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్బూరి వినోద్‌రెడ్డి, వెంకన్న, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత అంబేడ్కర్

ఖానాపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను స్ఫూర్తిప్రదాతగా ఎస్సై రఘుపతి అభివర్ణించారు. మండలంలోని బుధరావుపేటలో అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో విగ్రహ నిర్మాణ పనులకు ఆదివారం ఆయన భూమిపూజ చేసి మాట్లాడారు. యువత అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకుని జీవితంలో రాణించాలని సూచించారు. అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు సురేశ్, శ్రీనివాస్, యాకయ్య, హరీశ్, అశోక్, నగేశ్ పాల్గొన్నారు.

బోడ కాకరకాయ @రూ.200

మరిపెడ రూరల్: ఇటీవల కురుస్తున్న వర్షాలతో వ్యవసాయ క్షేత్రాలు, అటవీ ప్రాంతాల్లో బోడకాకరకాయలు ఎక్కువగా దొరుకుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో యువకులు, పశువుల కాపరులు అటవీ ప్రాంతాల్లో సేకరించి స్థానిక మార్కెట్లలో అమ్ముతున్నారు. మరికొందరు వీటిని సాగు చేపట్టి విక్రయాలు జరుపుతున్నారు. ప్రస్తుత మార్కెట్‌లో కిలో రూ.200 పలుకుతోంది. ఒక్కోసారి కిలో రూ.300 పలికిన సందర్భాలు ఉన్నాయి. కేవలం రెండు నెలలు మాత్రమే దొరకడం, ఔషధ గుణాలు కలిగి ఉండడంతో రేటు ఎక్కువైనా సరే బోడ కాకరకాయలు కొంటున్నారు.


సంతలో విక్రయిస్తున్న బోడ కాకరకాయలు

పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి

మరిపెడ రూరల్: భూ పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు మరిపెడ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) శరత్‌చంద్ర అన్నారు. ఆదివారం మరిపెడ మండల కేంద్రం, వీరారం తదితర గ్రామాల్లో భూములను క్షేత్రస్థాయిలో పర్యటించి భూ భారతి దరఖాస్తులను పరిశీలన చేశారు. ఈసందర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ.. భూ సమస్యల్లో భాగంగా వందలాది మంది రైతులు భూ భారతి చట్టం ద్వారా గత నెలలో దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. వారందరి భూముల వద్దకు వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి భూమికి సంబంధించి పూర్తి వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఇట్టి భూ సమస్యల సర్వే రిపోర్టులను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్లు ప్రవీణ్, అశోక్, సిబ్బంది ప్రవీణ్, రామకృష్ణ, నాగరాజు, ప్రణయ్, రైతులు పాల్గొన్నారు.


దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్ఐ శరత్‌చంద్ర

బుద్దారంలో పోలీసుల కార్డన్‌సెర్చ్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రవికుమార్

గార్ల: గార్ల మండలం బుద్దారం పంచాయతీలో ఆదివారం తెల్లవారుజామున ఎస్పీ ఆదేశాల మేరకు కార్డన్‌సెర్చ్ నిర్వహించినట్లు గార్ల బయ్యారం సీఐ బి.రవికుమార్ తెలిపారు. బుద్దారం గ్రామ పంచాయతీలోని అన్ని గ్రామాల్లో 50మంది పోలీస్ అధికారులు అక్రమంగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న ఇళ్లకు వెళ్లి సుమారు రూ.10వేల విలువ గల అక్రమ మద్యం బాటిళ్లు, 30లీటర్ల కాపుసారా, 1500 లీటర్ల బెల్లంపానకంను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడారు. అక్రమ వ్యాపారాలు చేసేవారు, చోరీలకు గురైన వాహనాలు, అనుమతి పత్రాలు లేని వాహనాలు ఈ కార్డన్‌సెర్చ్‌లో బయటపడతాయని పేర్కొన్నారు. నిరుద్యోగ యువకులు తమపై పోలీసు కేసులు కాకుండా చూసుకోవాలన్నారు. ఎస్సైలు రియాజ్‌పాషా, తిరుపతి, మైబూబీ, ఏఎస్సై రవీందర్, హెడ్ కానిస్టేబుళ్లు శ్యామ్, జయరాజు, కానిస్టేబుళ్లు, శ్రీను, షిరాజ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కుర్చీలు, టేబుళ్ల అందజేత



కేసముద్రం: మండలంలోని అన్నారం, కల్వల గ్రామాలలో డ్వాక్రా మహిళలకు వేం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ కుర్చీలు, టేబుల్‌లను కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మందాటి కళావతి, మూల లావణ్య, గంట కవిత, రజిత, కవిత, పద్మ, పుష్పలత, ప్రమీల, సుజాత, మీనా, నాయకులు ఎల్లాగౌడ్, గంట బాలక్రిష్టారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, జయేందర్‌రెడ్డి, చందు, పృథ్వీ, భుక్య రామచంద్రునాయక్, వాసు పాల్గొన్నారు.

ఆడపిల్లలంటే చిన్న చూపు పోవాలి



మహబూబాబాద్: ఆడపిల్ల పుట్టిందంటే అదృష్టంగా బావించాలని బత్తుల ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బత్తుల కృష్ణ అన్నారు. బత్తుల ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని రెడ్యానాయక్ కాలనీలో రాపోల్ స్వప్నకు ఆడపిల్ల ఉండగా బత్తుల కృష్ణ రూ.10వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్‌ను స్వప్నకు అందజేశారు. కార్యక్రమంలో మల్లేషం, కుమార్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా అందించాలి

బయ్యారం: రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియాను అందుబాటులో ఉంచాలని ఏఐకెఎంఎస్ రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బయ్యారంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ఏజెన్సీ మండలాలైన బయ్యారం, కొత్తగూడ, గంగారం, గూడూరు మండలాల్లో ఎక్కువ సంఖ్యలో రైతులు మొక్కజొన్న పంటను సాగు చేశారన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు మొక్కజొన్న పంటకు వేసేందుకు యూరియా అవసరం ఉండటంతో సకాలంలో యూరియా దొరకక రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు.

రైలు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్రగాయాలు

గార్ల: గార్ల రైల్వేస్టేషన్‌లో సింగరేణి రైలు నుంచి జారిపడిన ఓ వృద్ధుడికి తీవ్రగాయాలైన సంఘటన శనివారం రాత్రి జరిగింది. వివరాలిలావున్నాయి. కొత్తగూడెంకు చెందిన ఇష్టస్వామి(86) గార్ల రైల్వేస్టేషన్‌లో మంచినీళ్లు తాగేందుకు దిగాడు. వెంటనే రైలు కదలడంతో, రైలు ఎక్కే క్రమంలో కాలు జారి ఫ్లాట్‌ఫాంలో పడిపోయాడు. గమనించిన ప్రయాణికులు క్షతగాత్రుడిని బయటికి లాగగా అప్పటికే కాలు నుజ్జునుజ్జు అయ్యింది. క్షతగాత్రుడిని 108 వాహనంలో మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు 108 సిబ్బంది రవి పేర్కొన్నారు.

మానుకోటలో క్షుద్రపూజల కలకలం

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలో క్షుద్ర పూజలు చేసినట్లు కనిపించిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. జిల్లా కేంద్రంలోని నెహ్రూ సెంటర్ ప్రాంతంలో గల ఓ మొబైల్ షాప్ నిర్వాహకుడు శ్రీధర్ రోజు మాదిరిగానే శనివారం రాత్రి షాప్ బంద్ చేసుకుని ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం షాప్ ఓపెన్ చేయడానికి వచ్చిన అతడికి తన షాపు ముందు మెట్ల వద్ద క్షుద్ర పూజలు చేసిన ఆనవాళ్లు కనిపించడంతో భయాందోళనకు గురయ్యాడు. బాధితుడు టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపాడు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

తొర్రూరు రూరల్: బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్ అన్నారు. మండలంలోని టీక్యా తండాకు చెందిన గుగులోతు హరిచంద్రు ఇటీవల మృతి చెందగా ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు మాలోతు సునిత రాజేందర్ రూ.5వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు జాటోతు సురేష్, నాయకులు జాటోతు మొగిలినాయక్, రాంలాల్, శ్రీను, శ్రీకాంత్, నవీన్, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి కారు బోల్తా..



నెల్లికుదురు: అదుపు తప్పి కారు రోడ్డు పక్కకు దూసుకెళ్లి పల్టీలు కొట్టింది. ఈ ఘటనలో కారు ధ్వంసం కాగా ప్రయాణికులకు స్వల్ప గాయాలతో బయట పడిన సంఘటన మండలంలోని వావిలాల శివారు ప్రధాన రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుంచి మహబూబాబాద్ వైపునకు వెళ్తున్నకారు నెల్లికుదురు మండలం వావిలాల కల్వర్టు వద్దకు రాగానే గుంతల మయంగా ఉన్న కల్వర్టు వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి పల్టీలు కొట్టింది. డ్రైవర్ అప్రమత్తతతో కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గాయపడిన వారిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

తుప్పు పడుతున్న ప్రభుత్వ వాహనం

మహబూబాబాద్: ఆర్డీఓ కార్యాలయంలో సుమారు 8ఏళ్ల క్రితం ఆర్డీఓలకు కొత్త వాహనాలు రాగానే పాత వాహనంను పక్కకు పెట్టారు. నాటి నుంచి వాహనం షెడ్డులోనే ఉంది. షెడ్డుకే పరిమితమై పూర్తిగా తుప్పు పట్టుతుంది. ఇంకా అలాగే ఉంటే ఇనుప సమాన్ల షాపులో అమ్మే పరిస్థితి వస్తుంది. సంబంధిత ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి వారి ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకువాలని ప్రజలు కోరుతున్నారు. వాహనానికి మరమ్మతులు చేసి ఉపయోగించాలని కోరుతున్నారు.


షెడ్డులో ఉన్న ఆర్డీఓ కార్యాలయ వాహనం

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధి కేసముద్రంవిలేజ్‌లో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న కాశీవిశ్వేశ్వరాలయం, శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం, శ్రీ సరస్వతిదేవి ఆలయాల నిర్మాణానికిగాను, అమీనాపురంకి చెందిన బాణాల నాగరాజు, విద్యారాణి దంపతులు రూ.1,00,116ల విరాళాన్ని ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు బొల్లోజు రామ్మోహనాచారి, ఆరెందుల కుమారస్వామి, బొల్లోజు వెంకన్న, బొల్లోజు శ్రీనివాసచారి, కందుకూరి శ్రీనివాస్, కందుకూరి సోమయ్య, చిట్టోజు యాకాచారి పాల్గొన్నారు.


విరాళం అందజేస్తున్న దంపతులు